క్లుప్తంగా

వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: దేవులపల్లిలో అబుబకర్ మసీద్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. దేవులపల్లి ముస్లిం సోదరుల సహకారంతో రూ:50 వేల విలువైన వాటర్ ప్లాంట్‌ను మసీద్ స్థలదాతలైన బండివారిగూడెంకు చెందిన షేక్ ఖాదర్ వలీ, మౌలా సాహెబ్ దంపతుల పేరు మీద మసీద్‌కి బహూకరించారు. ఈ వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌ను స్థల దాత కుమారులైన షేక్ చాంద్ బాషా, షేక్ హుస్సేన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోరేపల్లి సత్యనారాయణ, దోరేపల్లి లక్ష్మీనారాయణ, దోరేపల్లి గంగరాజు, ప్రగడ సోంప్రకాష్, మసీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అక్బర్ సలీం పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డులో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సహిత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు స్వామివారికి పంచామృతస్నపన పూజా కార్యక్రమం నిర్వహించి, అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడిని చేశారు. కాగా ఆదివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, సాయంత్రం గ్రామోత్సవం, రాత్రికి స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



సోమిరెడ్డి మాతృమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ నాయకులు కాసర సోమిరెడ్డిని శనివారం జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి పరామర్శించారు. ఇటీవల సోమిరెడ్డి మాతృమూర్తి మృతిచెందారు. ఈనేపథ్యంలో జెడ్పీటీసీ బాబ్జి సోమిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన మాతృమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గుడపాటి రాధాకృష్ణ, మోటుపల్లి విజయ్, పంబి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

4 నుంచి ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయ 4వ వార్షిక వేడుకలను ఏప్రిల్ 4 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బవిరిశెట్టి మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో వార్షిక వేడుకల కరపత్రాన్ని బాలా త్రిపుర సుందరి పీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి సిద్ధాంతి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ 4వ తేదీన 108 కలశాలతో అమ్మవారి గ్రామోత్సవం, సహస్ర కలశాభిషేకం, సాయంత్రం లక్ష్మీగణపతి హోమం, 5న వారాహి హోమం, 6న ప్రత్యంగిరా హోమం, 7వ తేదీన 12 పుష్కర నదీ జలాలతో అభిషేకం, వసంతోత్సవం, పుష్పార్చన, రుద్ర హోమం నిర్వహిస్తామన్నారు. ఆరోజు సాయంత్రం 108మంది దంపతులతో శివకల్యాణం జరుగుతుందన్నారు. 8వ తేదీన చండీ హోమం, పూర్ణాహుతి, 9న మహాన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఈమని శశి కుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, విజయదుర్గ ఆలయ కమిటీ సభ్యులు, రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ దేవస్థాన సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పాలన

జంగారెడ్డిగూడెం: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని విశ్వసించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం దిశగా అనేక చర్యలు చేపట్టారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చి పాలనను ప్రజల చెంతకు చేరవేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ సచివాలయం ద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందించడం మొదలు పెట్టారు. సర్టిఫికెట్‌ల నుంచి రెవెన్యూ, రిజిస్ట్రేషన్, శానిటేషన్, విద్య, వైద్యం ఇలా ప్రతి సేవను సచివాలయ వ్యవస్థ ద్వారా అందించేందుకు అనువుగా తీర్చిదిద్దారు. గతంలో ఏ చిన్న పని జరగాలన్నా మండల కేంద్రాలకు పరుగులు పెట్టే ప్రజలు నేడు సచివాలయం వద్దకు వెళుతున్నారు. కేవలం నాలుగు అడుగుల దూరంలోనే తమ అవసరాలు తీర్చగలిగే సచివాలయాలు ఉండటంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అటువంటి వ్యవస్థకు అన్ని రకాల వసతులతో కూడి పక్కా భవనాలను కల్పించడం కీలకం. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భవన నిర్మాణాలు చేపట్టింది. భవనాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. కొత్తగా వ్యవస్థలు ఏర్పడినప్పుడు వాటిని నడిపించేందుకు సొంత భవనాలు లేకపోవడం, అద్దె భవనాలలో నిర్వహించడంతో గతంలో ఇబ్బందులు తలెత్తేవి. ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వం సచివాలయాలకు సొంత భవనాలను సమకూర్చుతోంది. ప్రతి సచివాలయ భవనానికి రూ.40 లక్షలు కేటాయించడంతో పాటు గ్రామ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంది. చింతలపూడి నియోజకవర్గంలో రూ.29.60 కోట్లు సచివాలయాల నిర్మాణానికి వెచ్చిస్తున్నారు. వీటిలో 24 సచివాలయాలు నిర్మాణం పూర్తయితే సంబంధిత శాఖకు అప్పగించారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.



పంగిడిగూడెంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



రాఘవాపురంలో సచివాలయ భవనం



కలరాయనగూడెంలో సచివాలయ భవనం



శ్రీనివాపురంలో గ్రామ సచివాలయ భవనం

చింతలపూడి నియోజకవర్గంలో...

మొత్తం సచివాలయాలు	74
నిర్మాణం పూర్తిచేసి అప్పగించినవి	24
నిర్మాణం పూర్తయినవి	26
చివరి దశలో ఉన్నవి	08
రెండో శ్లాబ్ పూర్తయినవి	04
మొదటి శ్లాబ్ పూర్తయినవి	04
రూఫ్ స్థాయి పూర్తయినవి	07
పునాది కంటే కింది స్థాయిలో	01

సచివాలయాలు.. ఆధునిక దేవాలయాలు



అభివృద్ధి అంటే మాటల్లో కాదు చేతల్లో ఉండాలి. సచివాలయ వ్యవస్థ ద్వారానే గ్రామ స్వరాజ్యం సాధ్యం అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసించారు. అందుకు అనుగుణంగా ప్రజలకు సక్రమంగా సేవలు అందించేలా సచివాలయ భవన నిర్మాణాలు చేశారు. ఒక్కొక్క భవనానికి రూ.40 లక్షలు కేటాయించి జీ ప్లస్ వన్ గా వాటిని నిర్మించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సచివాలయ వ్యవస్థ ద్వారా అందించేందుకు అనువుగా తీర్చిదిద్దారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించారు. నేడు సచివాలయాలు ఆధునిక దేవాలయాలుగా మారాయంటే సీఎం జగన్ కృషే కారణం.

– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి

హింసా మార్గాన్ని విడనాడాలి



చింతలపూడి సబ్ జైల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: చింతలపూడి సబ్ జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు శనివారం సందర్శించారు. సబ్ జైల్‌లో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలను గురించి జైలు అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. క్షణికావేశాల్లో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవించాక సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేని వారి కోసం న్యాయవాదిని లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఏసుపాదం, పింగుల డేవిడ్ రాజు, ఉమర్ ఫరూఖ్, పారా లీగల్ వలంటీర్ ఎండీ అక్బర్ ఆలి, జైల్ సూపరింటెండెంట్ జి వెంకటేశ్వరావు, సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలి



రామన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు చూస్తున్న దృశ్యం

కామవరపుకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలని కామవరపుకోట ఏరియా సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం రామన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వెల్ బేబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల బరువును తూకం వేసి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఏడాదిలోపు పిల్లలకు బరువు చూశారు. బేతంపూడి అభినవ్ అనే 10వ నెల బాబు ఎత్తుకు తగ్గ బరువు ఉండటంతో ఆరోగ్యవంతమైన బిడ్డగా గుర్తించి వెల్ బేబీ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మంగాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందించాలన్నారు. పోషకాహారం తీసుకోవడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా, మానసికంగా, శారీరకంగా దృఢంగా పెరుగుతారని చెప్పారు. తప్పనిసరిగా తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.జగదీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గురుకుల పాఠశాలలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని శనివారం కేఆర్ పురం ఐటీడీఏ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ పీవీఎస్ నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం జీలుగుమిల్లి ఆశ్రమ బాలుర పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని విద్యార్థుల సంఖ్య వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో సరఫరా చేసిన సరుకులను పరిశీలించారు. వంటలను కూడా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డెన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలి

జంగారెడ్డిగూడెం: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని నేటి యువత అలవర్చుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. షాహిద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల వర్ధంతిని శనివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి ఇఫ్టూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు అని, వారి ఆశయసాధనకు నేటి యువత కృషి చేయాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ వంటి పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇఫ్టూ డివిజన్ కార్యదర్శి మంచిలి రాజు, తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, తాడిగడప వెంకటేశ్వర్లు, పింగిలి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

- **వేలేరుపాడు:** స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద భగత్ సింగ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కంగాల గంగరాజు, యర్రా మధు, బంధం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగత్ సింగ్‌ని ఆదర్శంగా తీసుకొని నేటి సమాజంలో జరుగుతున్న అసమానతలు, దోపిడిపై పోరాడాలన్నారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లీ సాయిబాబు, మండల కార్యదర్శి బాడిశా రాము, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, జిల్లా కౌన్సిల్ పిట్టా వీరయ్య, విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం:** స్థానిక శ్రీ సాయి సూర్య హైస్కూల్‌లో అరసం అధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్ మాట్లాడుతూ భగత్ సింగ్ కలలుగన్న భారతదేశంలో తిరోగమన శక్తులు రాజ్యమేలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న నేటి మనువాద పాలకులకు వ్యతిరేకంగా దేశం మరో స్వాతంత్ర్య పోరాటం నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు పి పాండు రంగారావు, ప్రముఖ కవి నిమ్మగడ్డ అశోక్ బాబు, నేత్ర వైద్యులు కె సురేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.
- **కుక్కునూరు:** బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన పోరాట యోధుడు భగత్‌సింగ్ అని సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి అన్నారు. శనివారం భగత్ సింగ్ 93 వర్ధంతి సందర్భంగా సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, సీతారామనగరంలో మేడిపల్లి రమణయ్య భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కూరాకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం: భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



వేలేరుపాడు: భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం



టి.నరసాపురం: అరసం ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



కుక్కునూరు: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీవేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ మొదలుకుని ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్ఠి, బాలభోగ నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు నిర్వహించారు. భక్తులకు సీతంపేటకు చెందిన పరసా జస్వంత్ నాగ వెంకట్, గుడివాడకు చెందిన కొండపల్లి సాయిబాబు అన్నప్రసాద వితరణ చేశారు. స్వామివారిని దర్శించుకున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, జిల్లా ఫ్రీ ఆడిట్ అధికారులను, దాతలను స్వామివారి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమాలను ఈవో మానికల రాంబాబు, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ గుడపాటి రాధాకృష్ణ, సభ్యులు పర్యవేక్షించారు.

మదనగోపాలస్వామికి గ్రామోత్సవం



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయ ప్రధాన వార్షికోత్సవ సహిత పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. గత 20వ తేదీన ఈ ఉత్సవాలు ప్రారంభం కాగా ఐదు రోజులపాటు నిత్య పూజలు, హోమాలు, ప్రత్యేక పూజలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం కేశవాది ద్వాదశ మూర్తి సహిత మహా సుదర్శన హోమం, మహా శాంతి హోమం నిర్వహించి దేవేరులతో సహా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం పుష్పోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాలక మండలి చైర్మన్ మద్దు గోపి పేర్కొన్నారు.

విద్యాప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలి



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈఓ అబ్రహం

చింతలపూడి: విద్యాప్రమాణాలను మెరుగురచడానికి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం ఆదేశించారు. చింతలపూడి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. అనంతరం పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవోలు ఉన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

కొయ్యలగూడెం: పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ శనివారం కొయ్యలగూడెం సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన జయహో ధరణి, జయహో నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. 101 మంది విద్యార్థులు జానపద కళారత్న ఎల్‌ఆర్ కృష్ణబాబు పర్యవేక్షణలో నృత్య ప్రదర్శన చేశారు. కరస్పాండెంట్ ఐ.రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ జి.ఆనందరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ఆన్‌లైన్ ద్వారా 3,333 మందితో జరుగుతున్న లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం కైవసం చేసుకునేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో తమ విద్యార్థులు పాల్గొని ఎన్నికైనట్లు తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో వెల్ బేబీ షోను నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి

ద్వారకాతిరుమల: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. మండలంలోని పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. అందులో పాల్గొన్న సూపర్‌వైజర్ మేరి పోషకాహార ఆవశ్యకతను తల్లులకు వివరించి, ఆహారంతో పాటు మిల్లెట్స్‌ను కూడా వినియోగించాలని సూచించారు. అనంతరం వెల్ బేబీ షో, క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుమతి, నాగలక్ష్మి, శైలజ, సింధు, నాగలక్ష్మి, ఏఎన్‌ఎం దుర్గ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలి



జంగారెడ్డిగూడెంలో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ కె.స్లీవజోజి, సీఐ పి.రాజేష్, ఎంపీడీవో కేవీ ప్రసాద్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎన్నికల విధి విధానాలపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇందుకు గాను కేంద్రం నుంచి 200 మంది పారామిలటరీ సిబ్బంది నియోజకవర్గానికి వచ్చారని, వీరితో నియోజకవర్గంలో సభలు సమావేశాలు నిర్వహించి, ఎన్నికల పట్ల ప్రజల్లో ధైర్యాన్ని కల్పించేందుకు కృషిచేస్తున్నామన్నారు. అలాగే ప్రలోభాలను నివారించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్ ఎస్సార్ బంక్ వద్ద, కామవరపుకోటలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని, అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఎప్పటికప్పుడు నియోజకవర్గంలో పర్యటిస్తాయన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా మద్యం, నగదు, ఇతర వస్తువులు ఎవరైనా సరఫరా చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలు ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలనుకుంటే 24 గంటల ముందు అనుమతులు తీసుకోవాలని, అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. చింతలపూడి నియోజకవర్గ ఆర్వో, జంగారెడ్డిగూడెం డీఎస్పీకి, నేరుగా గాని, ఎన్నికలకు నిర్దేశించిన యాప్ ద్వారా గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళి ప్రకారం ప్రచారం చేసుకోవాలన్నారు. తప్పుడు సమాచారంతో చేసే ప్రసారాల పట్ల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, ఎస్సై జ్యోతిబాస్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.